కథ

# మాతృప్రేమ

-హెూతా పద్మినీదేవి

సూర్య మిత్ర నడుపుతున్న మారుతీ జిప్సీ రెట్టింపు వేగంతో కొట్టుకుంటున్న అతడి గుండె వేగంతో పోటీ పడుతోంది. స్టీరింగ్ మీద వున్న అతని చేతులు ఉద్వేగంతో కంపిస్తున్నాయి. పదినిముషాల క్రిందట డాక్టర్ రోజీ ఫోన్‌లో చెప్పిన ఆ వార్త అతడి నెంత కలవర పరిచిందీ అంటే, అతను కనీసం మాసిన షర్టుని కూడా మార్చుకోకుండా హాస్పిటల్‌కి ప్రయాణమయ్యాడు.

డ్రైవింగ్‌లో 'నిదానమే ప్రధానం' అని నమ్మే అతను ఆ రోజు ఎంతస్పీడ్‌గా నడుపుతున్నాడో అతనికే తెలియదు.

ఒక్క కుదుపుతో ఆగింది హాస్పిటల్ ఆవరణలో ప్రవేశించిన జిప్సీ. డోర్ తెరుచుకుని ఒక్క ఉదుటున క్రిందకి దిగాడతను.

పరుగులాంటి నడకతో మెటర్నిటీ వార్డు దగ్గరకి చేరుకున్న అతనికి నర్సు మేరీ ఎదురయింది. గత వారం రోజులుగా డాక్టరు అబ్జర్వేషన్‌లో వున్న తన భార్యని కంటికి రెప్పలా చూసుకుంటున్న నర్సు ఆమె.

'సిస్టర్! నా భార్య...' అతడి గుండె గొంతుకలోకి వచ్చిన క్షణాలవి.

'ప్రసవించారు. ఆడపిల్ల' ముక్తసరిగా చెప్పిన నర్సు ముందుకి వెళ్ళబోయింది.

ఆడ పిల్ల! ఆనందం అర్ణవమయింది. గుండె నిండిన సంతోషం చెలియలి కట్ట లేని ప్రవాహమయింది. తనూ ఒక బిడ్డకి తండ్రయ్యాడు. పెళ్ళయిన పన్నెండేళ్ళకి పిల్లల కోసం కలలు కని ఎన్నో ఆశలు పెంచుకుని ఆ ఆశ నిరాశ చేసుకుంటున్న తరుణంలో తన భార్య హారిక తనని తండ్రిని చేసింది.

అతను మెడలో వున్న బంగారు గొలుసుని తీస్తూ 'సిస్టర్!' అని పిలిచాడు. ఆ శుభవార్తని తనకి చెప్పిన నర్సుకి కానుకగా ఆ గొలుసు ఇవ్వాలని అతని ఉద్దేశం.

నర్స్ వెనుదిరిగింది. అప్పుడే వెనుక నుంచి డాక్టర్ రోజీ పిలిచిందతన్ని.

'మిస్టర్ సూర్య మిత్ర!'

సూర్యమిత్ర సంతోషంతో దీప్తివంతమైన ముఖంతో 'థాంక్ యూ డాక్టర్! థాంక్ యూ వెరీమచ్!' అన్నాడు.

'పాపని చూస్తారా?' అడిగింది డాక్టరు రోజీ. ఆవిడ ముఖం గంభీరంగా వుంది.

సూర్యమిత్ర గుండె క్షణకాలం కొట్టుకోడం ఆగినట్టయింది.

డాక్టరు ముఖంలో ఆ గాంభీర్యం ఎందుకు? ఏమయింది పాపకి?' అతడి వెన్నెముకలో మంచు గడ్డలు పెట్టినట్టు వణికిపోయాడు.

'డాక్టర్! ఎలా వుంది పాప? ప్లీజ్! చెప్పండి' ఆదుర్దాగా అడిగాడు.

డాక్టర్ రోజీ మౌనంగా ముందుకి నడిచింది. ఆ మౌనం అసహజంగా వుంది అతనికి.

రూమ్ నెంబర్ 315 ముందు ఆగింది డాక్టర్ రోజీ. సూర్యమిత్ర ఆమెను అనుసరించాడు.

లోపల బెడ్ మీద హారిక ప్రశాంతంగా నిద్రపోతోంది. ప్రక్కనే క్రెడిల్‌లో అప్పుడే పుట్టిన పసి కందు. డాక్టర్ క్రెడిల్‌లో నుంచి పాపని తీసి సూర్య మిత్రకి అందించింది.

'చూడండి!'

లక్ష ఓల్టుల విద్యుత్తు షాక్ తగిలినట్టయింది అతనికి.

'డాక్టర్!' ఆక్రందనలా వుందతని స్వరం. 'పాప...' అతను నిలువెల్లా కంపించిపోతున్నాడు.

'మల్టీపుల్ ఎబ్‌నార్మలిటీస్‌తో పుట్టింది. మీది మేనరికమా?'

'కాదు' హీన స్వరంతో అన్నాడు.

"మేనరికాలలో ఇలాంటి పిల్లలు పుట్టడానికి అవకాశాలు ఎక్కువగా వున్నాయి. మరి మీ విషయంలో ఇలా ఎందుకు జరిగిందో నాకు అర్థం కావడం లేదు."

సూర్యమిత్ర విహ్వలంగా తన చేతులలో అమాయకంగా నిద్రపోతున్న ఆ పాపనే చూస్తున్నాడు.

లేత గులాబీ రంగు వంటి చాయతో గుండ్రని ముఖం, పెద్ద పెద్ద కళ్ళు, నల్లటి వత్తైన జుట్టుతో, కుడి బుగ్గమీద విధాత పెట్టిన దిష్టి చుక్కలా వున్న కుంకుడు గింజంత పుట్టు మచ్చతో రబ్బరు బొమ్మలా వున్న ఆ పాపకి కాళ్ళు, చేతులు సరిగా లేవు.

'ఆపరేషన్ చేసి పాప కాళ్ళు చేతులు మామూలుగా చెయ్యవచ్చు కదా డాక్టర్!'

డాక్టర్ రోజీ నిస్పృహగా తలవిదిలించింది.

"కాళ్ళు చేతులు పైకి కన్పిస్తున్న లోపాలు. పాప అవిటిదే కాదు మూగ అవడానికి కూడా అవకాశాలున్నాయి. నాలుక కూడా సరిగ్గా లేదు."

అతని కళ్ళ నుంచి రెండు నీటి బొట్లు జారి పాప నుదుటిపై పడ్డాయి.

'ఏది సత్యం? ఏదసత్యం? క్షణం క్రిందటి ఆనందమా? ఇప్పటి విషాదమా?'

బలవర్ధకమైన తిండి, ఆరోగ్యకరమైన వాతావరణం, ప్రతినెలా డాక్టరు చెకప్, మందులు.... ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా పాప ఇలా పుట్టడానికి కారణ మేమిటి? ఎక్కడుంది లోపం?

'నాలగవనెలలో స్కానింగ్ తీయించుకుని వుంటే ఫీటస్ అబ్‌నార్మలిటీస్ తెలిసి వుండేవి. అప్పుడే అబార్షన్ చేయించుకుని వుంటే....' డాక్టర్ స్వరంలోని సానుభూతి అతడి గుండెని కోస్తోంది.

'భగవంతుడా! ఎందుకిలా చేసావ్?' అతని హృదయం మూగగా రోదిస్తోంది.

హారిక నెల తప్పిన దగ్గర నుంచి నెలలు నిండే వరకు ఆమెని చూస్తున్న డాక్టరమ్మ, నెల క్రిందటే అమెరికా వెళ్ళిన ఆమె... ఎప్పుడూ స్కానింగ్ విషయం ప్రస్తావించనే లేదు.

ఒకటి రెండు సార్లు హారిక స్కానింగ్ తీయించుకుంటానని అడిగింది భర్తని.

'దేనికి స్కానింగ్? కడుపులో వున్నది ఆడో, మగో తెలుసుకోడానికేగా? పుట్టబోయేది పాపో, బాబో, ముందుగా తెలిస్తే థ్రిల్ వుండదు హారికా! వద్దు నా కిష్టం లేదు' అభ్యంతరం పెట్టాడు సూర్యమిత్ర.

'తను అనుభవిస్తున్న థ్రిల్ ఇదా?' సూర్యమిత్ర మనసుని వేదన మెలిత్రిప్పుతోంది.

'నా భార్య పాపని చూసిందా డాక్టర్!' అడగలేక అడిగాడతను.

'చూసారు! పాప అన్ని అవకరాలతో పుట్టిందని బాధపడుతుంటే ఆవిడ మెంటల్‌గా డిస్టర్బ్ అవకూడదని పెథిడిన్ ఇచ్చాను.'

పది నిముషాల తర్వాత అతను డాక్టర్ రోజీ కన్సల్టింగ్ రూమ్‌లో ఆవిడకెదురుగా విషణ్ణ వదనంతో కూర్చుని వున్నాడు.

'పాప భవిష్యత్ ఏమిటి డాక్టర్?'

'అన్ని అంగ వైకల్యాలతో పుట్టిన పిల్లలు బ్రతకడం అరుదు. బ్రతికినా నెలలు లేదా కొన్ని సంవత్సరాలు.'

కొన్ని క్షణాల విరామం తర్వాత అన్నాడతను. 'పాపని నేను ఇంటికి తీసుకెళ్ళను డాక్టర్! ఏ అనాథ శరణాలయంలోనో వదిలి పెడతాను.'

చివ్వున తల ఎత్తి చూసింది డాక్టర్ రోజీ.

"నేను మీకు కసాయి వాడిలా కన్పించవచ్చు డాక్టర్! కాని, అన్ని అవయవ లోపాలున్న పాపని ఎలా పెంచమంటారు? అసలా పాప నా పాప అని అనుకుంటే ఆ ఊహకే నా ఒళ్ళు జలదరిస్తోంది! అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను."

సూర్యమిత్ర కళ్ళ వెంట నీళ్ళు.

డాక్టరు అతని బాధని అర్థం చేసుకున్నట్టు జాలిగా సానుభూతిగా చూసిందతన్ని.

'ఓ.కె! మీ ఇష్టం'

'నా భార్యకి ఇప్పట్లో మెలుకువ రాదు కదా డాక్టర్!'

'రాదు. ఆ ఇంజక్షన్ ప్రభావం మరో గంట దాకా వుంటుంది.'

'ఈలోగా పాపని తీసికెళ్తాను.'

'స్పృహ వచ్చాక మీ భార్య పాప కోసం అడిగితే...' సందేహంగా అడిగింది డాక్టర్ రోజీ.

'పాప చనిపోయిందని చెప్పండి!' సూర్య మిత్ర స్వరం గాద్గదికంగా వుంది.

పది నిముషాల తర్వాత అతను డ్రైవ్ చేస్తున్న మారుతీ జిప్సీ అనాథ శరణాలయం వైపు వెళ్తోంది.

✿ ✿ ✿ ✿ ✿

'నాకు నా పాప కావాలి! తెచ్చి ఇవ్వండి! నా పాపని నాకు ఇవ్వండి' హారిక ఉన్మాదంగా అరుస్తోంది.

సూర్యమిత్ర చెమ్మగిలిన కళ్ళతో నిస్సహాయంగా భార్యని చూస్తున్నాడు.


పాప చనిపోయి... కాదు... పాపని అనాథ శరణాలయంలో వదిలి పెట్టి నెల రోజులు.

ఈ నెల రోజుల నుంచి హారిక కంటికి మంటికి

ఏకధారగా ఏడుస్తూనే వుంది.

ఒక రోజు సూర్యమిత్ర స్నానం చేస్తుండగా ఇంట్లోంచి వెళ్ళిపోయింది.

అతను కంగారుగా కారు తీసుకుని భార్య కోసం



రోడ్లన్నీ గాలించి, విఫలుడయ్యాడు. చివరకి ఎవరో చెప్పారు. ఆమె స్మశానం వైపు వెళ్తుంటే చూసామని.

సూర్యమిత్ర ఆదుర్దాగా శ్మశానం దగ్గరకి వెళ్ళి అక్కడ కనిపించిన దృశ్యం చూసి స్థాణువయ్యాడు.

కన్పించిన మట్టి, దిబ్బనల్లా తవ్వుతోంది హారిక. గోతులలో నుంచి బయటపడిన ఎముకలని చూసి 'నా పాప కాదు! నా పాప కాదు' అని గొణుక్కుంటోంది.

సూర్యమిత్రని చూడగానే ఆవేశంగా అతని షర్టు కాలర్ పట్టుకుని గుంజేస్తూ 'నా పాప ఎక్కడుంది? చెప్పు!' అంటూ పిచ్చిదానిలా అరిచింది.

ఆ రోజు అక్కడ నుంచి హారికని ఇంటికి తీసుకురావడానికి ఎంత కష్టపడ్డాడని! భార్య వాలకం చూస్తే ఆమె పిచ్చిదవుతుందేమోనని భయం వేస్తోంది, సూర్యమిత్రకి.

'నాపాపని నాకు తెచ్చివ్వండి!' హారిక అరుస్తూ అతని షర్టు పట్టి గుంజడంతో అతను ఆలోచనలలో నుంచి తేరుకుని తల విదిలించాడు.

'భగవంతుడు నిర్దయుడు హారికా! మనకి పాపని ఇచ్చినట్టే ఇచ్చి తీసేసుకున్నాడు. చచ్చిపోయిన పాపని బ్రతికించడానికి నేనేం దేముడినా చెప్పు, నువ్వు చదువుకున్న దానివి. అర్థం చేసుకో!' భార్యని గుండెలలో పొదువుకుని అనునయంగా ఆమె తల నిమరసాగాడు.

హారిక వెక్కి వెక్కి ఏడుస్తోంది.

'కన్న తల్లికి ఒక్కత్తే పాప! పిల్లలు లేని వాళ్ళకి లోకమంతా బిడ్డలే! నువ్వు కావాలనుకుంటే మనం ఎవరినైనా పెంచుకుందాం! అనాధ శరణాలయంలో ఒక చక్కని పాపని చూసాను. ఎవరో పెద్దింటి అమ్మాయి పెళ్ళి కాకుండానే కని వదిలేసిందిట. నువ్వు కావాలనుకుంటే ఆ పాప మనదవుతుంది. ఆ పాపలో చనిపోయిన మన పాపని చూసుకో!'

నెల రోజుల క్రిందట అనాధ శరణాలయంలో వదిలేసిన తమ పాపని సమయం వచ్చింది కనుక ఇప్పుడు తెచ్చుకోవచ్చు అనుకున్నాడు భార్య ఆవేదన చూడలేని సూర్యమిత్ర.

భర్త చెప్పినదానికి హారిక సమ్మతించలేదు. అలాగని తిరస్కరించనూ లేదు. మౌనంగా వుండి పోయింది.

వారం రోజులు గడిచాయి. ఈ వారం రోజులలో హారికలో మార్పు వచ్చింది. గతంలోలా అస్తమానం ఏడవడంలేదు. ఆలోచిస్తోంది.

ఆ రోజు ఆమె భర్త దగ్గరకి వచ్చింది.

'మీరు చెప్పారే... ఆ పాపని మనం తెచ్చుకుందాం'

భార్యలోని ఈ మార్పు సూర్యమిత్రని సంతోష పెట్టింది. క్షణం ఆలస్యం చెయ్యకుండా భార్యతో కలిసి బయలుదేరాడు. దారి పొడవునా భార్యని ఉత్సాహపరుస్తూ మాట్లాడాడు. చాలా రోజుల తర్వాత హారిక పెదవులపై చిరునవ్వు అతడికెంతో తృప్తిని కలుగచేసింది.

మాటల మధ్య అడిగింది ఆమె. 'ఆ పాపకి వయసెంత వుంటుంది?'

'రెండు నెలలు' క్షణం ఆలోచించి అన్నాడు.

'కనగానే వదిలేసిందా ఆ మహాతల్లి! నవ మాసాలు మోసి కన్న పాపని పురుటికందుగా వుండగానే వది లెయ్యడానికి ఆ రాక్షసికి చేతులెలా వచ్చాయో!' నిరసనగా అంది.

తన ముఖంలో మారుతున్న రంగులని భార్య కంట పడనివ్వకుండా చివ్వున ముఖం తిప్పుకున్నాడు సూర్యమిత్ర.

ట్రాఫిక్ జామ్ అయినట్టుంది. ముందున్న వాహనాలన్నీ నిలిచి పోవడంతో సూర్యమిత్ర కూడా తన కారు ఆపవలసి వచ్చింది.

'అమ్మా! ధర్మం చెయ్యండమ్మా! అవిటి పిల్లపై, కనికరం చూపండమ్మా!' దీనంగా వినపడుతున్న బిచ్చగాడి స్వరం!

బ్యాగ్ తెరిచి చిల్లర తీసి బిచ్చగాడి జోలెలో వెయ్య బోతున్న హారిక ఉలికిపాటుతో ఆగిపోయింది.

పేవ్ మెంటు మీద చింకి గుడ్డల మీద పడుకో బెట్టబడి వున్న ఆ పాప... ఆ పాప.... నిశ్చేష్టితయై వెడల్పయిన కళ్ళతో చూస్తోందామె.

గులాబీలు రాశిపోసినట్టున్న ఆ ఒంటి రంగు కుడి బుగ్గ మీద వున్న కుంకుడు గింజంత పుట్టు మచ్చ... తన పాప... చనిపోయిన తన పాప ఇక్కడ ఈ బిచ్చగాడి దగ్గర...

'ఏమండీ!' ఆర్త నాదంలా వుందామె పిలుపు...

'అటు చూడండి! మన పాప...'

భార్య చూపించిన వైపు చూసిన సూర్యమిత్ర ఉలిక్కిపడ్డాడు.

'ఆ పాప... మన పాప... చచ్చిపోయిన మన పాప... ఆ బిచ్చగాడి దగ్గరకెలా వచ్చింది?' ఆమె స్వరంలో దుఃఖం గరగర లాడుతోంది.

'ఆ పాప తమ పాపే!' సూర్యమిత్ర సులభంగానే గుర్తుపట్టాడు. అతను తనలో పొంగి పొరలుతున్న బాధావేదనలను ఒక గుటక వేసి దిగమ్రింగుతూ అన్నాడు.

'మన పాప చనిపోయింది హారికా! ఆ పాప ఆ బిచ్చగాడి కూతురయి ఉంటుంది!'

'నో!' హారిక గట్టిగా అరిచింది. 'నా పాప చని పోలేదు. ఆ పాప నా పాపే!' ఆమె భర్త వారించేలోగానే చటుక్కున డోర్ తీసుకుని దిగేసింది.

'అమ్మా! ధర్మం చెయ్యండమ్మా! అవిటి పిల్లపై కనికరం చూపించండమ్మా!' బిచ్చగాడు కారులో నుంచి దిగిన హారికని చూసి ఆశగా ఆమె వైపు సత్తు గిన్నెని జాపాడు.

హారిక బ్యాగ్‌లో నుంచి చేతికి అందిన నోట్లు తీసి ఆ గిన్నెలో పడేసింది.

అన్ని నోట్లు.... ఎన్ని వందలుంటాయో?' బిచ్చగాడు వికసించిన ముఖంతో ఆత్రంగా లెక్క పెట్టుకుంటున్నాడు.

'నిజం చెప్పు. ఆ పాప నీ పాపేనా?' తీక్షణంగా చూస్తూ అడిగింది హారిక.

'నా పాపేనమ్మా! నా పెళ్ళాం ప్రసవించింది. తొలిచూలు బిడ్డ. ధర్మప్రభువులు. మీరు చల్లగా వుండాలి.' అయిదు వందల రూపాయలను అయిదు పైసల్లా తనకి ముష్టి వేసిన హారికకి చేతులెత్తి దణ్ణం పెట్టాడు వాడు.

'అబద్ధం! ఆ పాప నీ పాప కాదు!' గద్దించిందామె.

ఈసారి బిచ్చగాడి ముఖంలో భయం కన్పించింది.

'నిజం చెప్పు!' దుఃఖం నిండిన స్వరంతో ఆమె ప్రాధేయ పూర్వకంగా అడుగుతూ బ్యాగ్‌లో నుంచి మరో నోట్ల కట్ట తీసి విసిరేసింది. ఆ డబ్బుని ఆదుర్దాగా అందుకున్నాడు వాడు.

'అనాధ శరణాలయం నుంచి వంద రూపాయలకి కొనుక్కున్నాను. నేను అడుక్కుంటూంటే 'దుక్కలా వున్నావ్! ఏదైనా పని చేసుకుని బ్రతక రాదా అని ఈసడించే వారమ్మగారూ! పాపని నేను తెచ్చుకున్నాక, పాపని చూసి జాలిపడి నాకు ముష్టి వేస్తున్నారమ్మగారూ!' హారిక ఇచ్చిన డబ్బే వాడి చేత నిజం పలికించిందో, లేక ఆమె కళ్ళలోని నీళ్ళు వాడిలోని నిజాయితీని వెలికి తీసిందో తెలియదు. హారిక బ్యాగ్‌లోని డబ్బంతా వాడి ముందు గుమ్మరించింది. 'ఈ డబ్బంతా తీసుకుని పాపని నాకివ్వు!' బిచ్చగాడి సమాధానం కోసం ఆగకుండా చింకి గుడ్డల మధ్య వున్న పాపని అపురూపమైన పెన్నిధిలా చేతుల మధ్యకి తీసుకుంది.

పాలిపోయిన ముఖంతో నిలబడి వున్న సూర్యమిత్ర దోషిలా తల వంచుకున్నాడు.

ఆమె అతడి చేతిలోని కారు తాళాలని విసురుగా లాక్కుంది.

'హారికా!' అతను ఆదుర్దాగా పిలిచాడు.

హారిక ఆగలేదు. పాపతోసహా కారెక్కి కారు స్టార్ట్ చేసింది. 'హారికా!' సూర్యమిత్ర ఆమెను ఆపాలని కారు దగ్గరకి పరిగెట్టాడు.

కారు సంధించి విడిచిన బాణంలా ముందుకి దూసుకు పోయింది. అనాధ శరణాలయంలో ఆమెకి కావలసిన వివరాలు లభించాయి. ఆ పాప తన పాపే! హారిక దుఃఖోద్వేగంతో కంపించిపోతోంది. పాప చనిపోయిందని డాక్టరు చెప్పినప్పుడు కూడా అంత దుఃఖం కలగలేదామెకి.

నవమాసాలు మోసి, రక్తం చిందించి కన్న తన పాప, తల్లి తను వుండగానే అనాథగా అనాధ శరణాలయంలో చేర్చబడడానికి కారణం పాప అంగ వైకల్యం!

ఒక బిచ్చగాడు బ్రతకడానికి డబ్బు సంపాదించి పెడుతున్నదీ పాప అంగవైకల్యమే.

చెంపల మీదే నుంచి కారే కన్నీటిని తుడుచుకోడం మరచిపోయింది హారిక.

భార్య కోసం వెదికి విఫలుడై ఆమె ఇంటికి వెళ్ళి వుంటుందనే ఆశ ఏమూలో రెపరెపలాడుతుంటే ఆటోలో ఇంటికి చేరిన సూర్యమిత్ర ఎదురుగా కన్పించిన హారికని చూసి ముందుకి అడుగు వెయ్యలేకపోయాడు.

హారిక గుండెల దగ్గరగా పాపని పొదివి పట్టుకుని వుంది. ఎడమ చేతిలో సూట్‌కేస్!

'హారికా!' అతనామె దగ్గరగా వెళ్ళాడు. 'నన్ను క్షమించు!' అతని కళ్ళలో నీళ్ళు.

'ఎందుకిలా చేసారు? పాపని కన్న తల్లిని నేనుండగా అనాధ నెందుకు చేసారు? అవిటి దానిగా పుట్టడం అది చేసుకున్న పాపమా? ఈ అవిటి పిల్ల మీ బిడ్డ అని చెప్పుకోడం మీకు నామర్దా కదూ? అందుకే కదూ, దాన్ని అనాధ శరణాలయంలో వదిలి పెట్టి నిశ్చింతగా చేతులు దులుపుకున్నారు? పాపకంటే పెద్ద అంగవైకల్యం మీకు వుంది! అంగ వైకల్యం గల పాప మీ బిడ్డ అని చెప్పుకోడానికి నోరు లేని మూగవారు. అలాంటి పాపకి మనస్థైర్యాన్నిస్తూ అండగా, నిలబడలేని కుంటి వారు మీరు. కన్న బిడ్డని గుండెలకి హత్తుకోడానికి మీకు చేతులు లేవు. మీరంటే నాకసహ్యం. అందుకే.... నేను, నా పాపతో సహా ఇక్కడ నుంచి మీకు దూరంగా... మీ నీడ కూడా మాపై పడనంత దూరంగా వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను.

'హారికా!' పసివాడిలా ఏడుస్తూ ఆమెని చుట్టేసాడు సూర్యమిత్ర.

"నేను చేసిన పాపం క్షమించరానిది. నువ్వు నన్ను క్షమించగలిగితే పాపకి తండ్రిగా నాకు స్థానమియ్యి. ఈ వికలాంగుడికి చేయూతనియ్యి."

అతను ఏడుస్తున్నాడు. మనసు నావరించుకుని వున్న మంచు తెరలు కరిగిపోయేలా ఏడుస్తున్నాడు.

హారిక తడికళ్ళతో అతని వైపు చూసి ఓదార్పుగా, అతని భుజంపై చెయ్యి వేసింది. అతను పాపతో సహా ఆమెని గుండెలో పొదువుకున్నాడు. ❑